కమనీయం.. రాములోరి కల్యాణం



రాజంపేట టౌన్: సీతారాముల కల్యాణోత్సవాన్ని జరిపిస్తున్న పురోహితులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని మన్నూరులో గురువారం రాములోరి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తొలుత సీతారాముల ఉత్సవ మూర్తులను పట్టువస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. అనంతరం ప్రత్యేకంగా తయారు చేసిన వేదికపై ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి పురోహితులు స్వామివారి కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా కనుల పండువగా నిర్వహించారు. స్వామివారి కల్యాణ మహోత్సవం జరుగుతున్నంతసేపు భక్తులు ఆధ్యాత్మిక తన్మయత్వంలో ఉండిపోయారు. కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఇదిలావుంటే నియోజకవర్గంలోని రామాలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఆయా ఆలయాల పురోహితులు విశేషంగా పూజలు జరిపారు. పలు ఆలయాల్లో రాత్రి వేళల్లో భజనలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపడుతున్నారు. దీంతో పల్లె, పట్టణం అన్న తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో శ్రీరామనవమి వేడుకల సందడి స్పష్టంగా కనిపిస్తుంది.

క్రమబద్ధీకరణను సద్వినియోగం చేసుకోవాలి

రాజంపేట రూరల్ : ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా 15.10.2019కి ముందు నిర్మించుకున్న గృహాలను క్రమబద్ధీకరించుకోవాలని తహసీల్దార్ పీర్‌మున్నీ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ పీర్‌మున్నీ సాక్షి మీడియాకు వివరాలు తెలియజేశారు. ఈ సమావేశంలో తహసీల్దార్ పీర్‌మున్నీ మాట్లాడుతూ ఈ యేడాది జనవరి 29న ప్రభుత్వం జీఓ నెంబరు 30ని జారీ చేసిందన్నారు. 150 చదరపు గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని తెలియజేశారు. పక్కా గృహాలతో అర్హులైన లబ్ధిదారులు తమ పరిధిలోని సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్కెట్ విలువ ప్రకారం క్రమబద్ధీకరించబడుతుందని తెలియజేశారు. ఇదే సమయంలో ప్రభుత్వ మార్గ దర్శకాల ప్రకారం 151–300, 301–450, 451 గజాలకు పైన ఇంటి నిర్మాణంను బట్టి, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలు, ఎగువన ఉన్న వారి రిజిస్ట్రేషన్ బేసిక్ విలువలో, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. గ్రామస్థాయిలో రూ.10వేలు, పట్టణ స్థాయిలో రూ.14వేలు నెలసరి ఆదాయం ఉన్న వారు అర్హులన్నారు. నెలకు రూ.300 లోపల విద్యుత్ చార్జీలు చెల్లిస్తూ ఉండాలన్నారు. మెట్ట, మాగాణి కింద కలిపి 10 ఎకరాలకు మించి ఉండకూడదన్నారు. క్రమబద్ధీకరణకు రిజిస్టర్ డాక్యుమెంట్, ఆస్తిపన్ను చెల్లింపు, విద్యుత్ బిల్లు, వాటర్ బిల్లులను పరిగణలోకి తీసుకుంటామన్నారు.

మామిడి రైతులకు రాయితీపై ఫ్రూట్ కవర్లు



చిట్వేలి ఉద్యానశాఖ కార్యాలయం

పుల్లంపేట : మామిడి పంట సాగులో ప్రధాన సమస్యలైన మంగు, మసి తెగులు, పండు ఈగ, తామర పురుగులు, బూడిద తెగులు, మచ్చ తెగులు, కాయ తులుచు పురుగు, పిండి నల్లి, టెంక పురుగుల దాడిని నియంత్రించడానికి, నాణ్యమైన దిగుబడికి ఫ్రూట్ కవర్లు ఎంతగానో ఉపయోగపడతాయని ఉద్యాన అధికారులు ఆషియా, భాస్కర్‌లు తెలియజేశారు. పిందె దశలో అనగా నిమ్మకాయ, కోడిగుడ్డు పరిమాణంలో పిందెలు ఉన్నప్పుడు పండ్ల కవర్ మధ్యలోకి పిందెలు వచ్చేలా పిందెలకు కవర్లు తొడిగి, కవర్లకు ఉండే తీగ సహాయంతో కవర్లను గాలి లోపలికి వెళ్లకుండా పిందె నుంచి మూడు సెంటీమీటర్లు పైన తొడిమికి కవర్లు కట్టాలని, పండ్ల కవర్లు కట్టిన 50 నుంచి 60 రోజులు తరువాత కాయలను కోసుకోవచ్చని వారు తెలిపారు. ఈ ఫ్రూట్ కవర్లు మామిడి పండ్లను చీడపీడల బారిన పడకుండా కాయ నాణ్యతను పెంచుతుందన్నారు. అలాగే అధిక ఉష్ణోగ్రతలు, వర్షం, వడగండ్లు, గాలుల వల్ల నష్టం వాటిల్లకుండా కాపాడుతుంది. అలానే రసాయన మందుల వినియోగాన్ని తగ్గిస్తుందని, కాయ రంగు, షైనింగ్ పరిమాణాన్ని మెరుగు పరుస్తుందని, మామిడిపండ్ల నాణ్యతా ప్రమాణాలు పెరగడం వల్ల అంతర్జాతీయ ఎగుమతులకు అవకాశం లభిస్తుందని పేర్కొన్నారు.

రైల్వేకోడూరు అర్బన్ : మామిడి రైతులకు 50 శాతం సబ్సిడీతో రైతులకు గరిష్టంగా 10 వేల కవర్లు అందిస్తున్నట్లు హెచ్ఓ వెంకటభాస్కర్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మామిడి కాయలకు చీడపీడలు పట్టకుండా ఈ కవర్లు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. రైతులు ఈ కవర్లు ఉపయోగిస్తే మంచి ఫలితాలు ఉంటాయని పేర్కొన్నారు.

భూ నిర్వాసితులకు న్యాయం చేస్తాం



తూముకుంట సోలార్ నిర్వాసితులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

గాలివీడు : సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన వారికి న్యాయం చేస్తామని ఆర్డీఓ శ్రీనువాసులు తెలిపారు. గురువారం గాలివీడు మండలంలో పర్యటించిన ఆయన తూముకుంట సోలార్ నిర్వాసితులతో చర్చించారు. ఆర్డీఓ మాట్లాడుతూ 100 మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణం కోసం 114 ఎకరాల భూమిని గుర్తించగా అందులో 57 ఎకరాలు ప్రభుత్వ స్థలం కాగా, 57 ఎకరాల డీకేటీ అనుభవంలో వున్నట్లుగా గుర్తించామన్నారు. అర్హులు గుర్తించి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

డంపింగ్ యార్డులోనే చెత్తాచెదారం వేయాలి

కుషావతి నగర్‌కు చెందిన స్థానికులు ఆర్డీఓను కలసి కుషావతి నది(చిన్నేరు)లో చెత్తా చెదారం వెయ్యడం పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలో చెత్తాచెదారం వెయ్యడం ద్వారా చుట్టుపక్కల నివాసం వుంటున్న తాము అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన ఆర్డీఓ శ్రీనివాసులు చెత్తా చెదారం డంపింగ్‌ను కేటాయించిన స్థలంలో మాత్రమే వేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ను ఆదేశించారు. అయితే గతంలోనే చెత్త డంప్ చెయ్యడం కోసం కుంచిబండ వద్ద స్థలం కేటాయించామని పంచాయతీ వారు మాత్రం వినియోగించుకోవడం లేదని ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పంచాయతీ సిబ్బంది చెత్తను కేటాయించిన డంపింగ్ యార్డ్‌లో మాత్రమే వేసేలా చర్యలు తీసుకోవాలని డీపీఓకు చారవాణి ద్వారా సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ భాగ్యలత, ఆర్ఐ బాలాజీ, సర్వేయర్ మురళీ పాల్గొన్నారు.




ఏకశిలానగరం.. కల్యాణ సంబరం

- ముస్తాబైన ఆంధ్ర భద్రాద్రి
- నేడు శ్రీ సీతారాముల కల్యాణం
- పట్టువస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి
- అన్ని ఏర్పాట్లు చేసిన టీటీడీ





సీతారాముల కల్యాణానికి సిద్ధమైన వేదిక (ఇన్‌సెట్) ఏకశిలపై వెలసిన సీతారామలక్ష్మణులు



ఒంటిమిట్టలో విద్యుద్దీపాలంకరణ..

ఒంటిమిట్ట : ఆంధ్రప్రదేశ్‌లోని కడప జిల్లాలో ఉంది ఒంటిమిట్ట. చుట్టూ కొండలు, పచ్చని పంట పొలాల మధ్యలో ఉంటుంది. ఇక్కడి కోదండ రామాలయం అపురూప శిల్ప సంపదతో అలరారుతున్న ఈ దేవాలయ నిర్మాణంలో చోళరాజులు విజయనగర రాజులు, మట్లి రాజుల కళావైభవం కనిపిస్తుంది. రాజగోపురాలపై అందమైన శిల్పాలు కనువిందు చేస్తాయి. ఆలయ మంటపంలోని ప్రతి స్తంభం ఒక కళారుపాన్ని ప్రదర్శిస్తుంది.

చతుర్దశి నాడు.. పున్నమి వెలుగుల్లో..

ఏకశిలానగరి శ్రీ కోదండ రామాలయంలో శ్రీ రామనవమి రోజు కాకుండా నిండు వెన్నెల రోజు సీతారాముల కల్యాణం జరుగుతుంది. ఆ మేరకు శుక్రవారం రాత్రి రామయ్య పెళ్లి జరగనుంది. చిన్నతనం నుంచి దాశరథికి చంద్రుడు అంటే ఇష్టం. చిరుప్రాయంలో ఆకాశంలో చంద్రున్ని చూపిస్తేనే ఆహారాన్ని అరగించేవాడు. రఘురాముడు చైత్ర శుద్ధ నవమి నాడు పునర్వసు నక్షత్రంలో విళంబినామ సంవత్సరంలో జన్మించాడు. ఆయన వివాహ మహోత్సవాలు అన్ని ఆలయాల్లోనూ నవమి నాడే అభిజిత్ లగ్నంలో నిర్వహిస్తారు.

భద్రాచలం రామక్షేత్రంలో, తిరుపతి కోదండ రామాలయంతో పాటు దాదాపు అన్ని చోట్ల చైత్ర శుద్ధ పాడ్యమి నుంచి ఉత్సవాలు ప్రారంభం అవుతాయి. నవమి నాటి కల్యాణంతో ముగుస్తాయి. ఇలా అనేక చోట్ల పగలు రామయ్య పెళ్లి జరిగితే ఒక ఒంటిమిట్టలోనే రాత్రి వేళ నిర్వహిస్తారు. ఈ సంప్రదాయం ఇప్పటిది కాదు. ఆలయ దివ్య దర్శనం ప్రజలకు అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇలాగే జరుగుతోంది.

క్షేత్ర సామంత రాజు బుక్కరాయలు పాలనలో ఒంటిమిట్టలో శ్రీరామ బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. ఆ ఉత్సవాల్లో భాగంగా శ్రీరామ కల్యాణోత్సవం జరగాలి. రామాయణంలో శ్రీరామచంద్రుడి కల్యాణ నక్షత్రం ఉత్తర ఫల్గుని, ఆ నక్షత్రానికే ఒంటిమిట్టలో వివాహం జరిపించేలా నిర్ణయం తీసుకున్నారు. ఒంటిమిట్టలోనే తొలి కల్యాణోత్సవానికి ఉత్తర ఫల్గుని నక్షత్రం రాత్రి పూట వచ్చింది. రాత్రి వివాహం జరిపించవచ్చునా? లగ్నశుద్ధి సప్తమ శుద్ధి చూసుకొని వివాహ కాలనిర్ణయం జరిగింది. ఇది శాస్త్ర విరుద్ధం కాదు. ఈ విధంగా బుక్కరాయల కాలంలో రాత్రిపూటే తొలి సీతారాముల కల్యాణ మహోత్సవం జరిగింది. ఇక అప్పటి నుంచి ఒంటిమిట్టలో ఉత్సవాలు తొలి సంవత్సరాన్ని బట్టే నిర్ణీతమయ్యాయి.

పట్టువస్త్రాలు సమర్పించనున్న ముఖ్యమంత్రి

ఒంటిమిట్ట క్షేత్రంలో శ్రీ సీతారాముల కల్యాణం ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురవారం ఒంటిమిట్టలో జరిగే శ్రీ సీతారాముల కళ్యాణానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కోదండ రామాలయంలోని మూల మూర్తులకు ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పిస్తారు. లోకపాలకుడి కల్యాణం కావడంతో రాష్ట్ర నలమూలల నుంచి కల్యాణాన్ని వీక్షించేందుకు ప్రముఖులు, స్వామి వారి భక్తులు తరలి రానున్నారు.

తాగునీటి కోసం మహిళల నిరసన



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న ఉప్పరపల్లి గ్రామ మహిళలు

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లి గ్రామ మహిళలు తాగునీటి కోసం గురువారం ఖాళీ బిందెలతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సిద్దవటం మండలం ఉప్పరపల్లి గ్రామంలో కొన్ని రోజులుగా తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని మహిళలు అన్నారు. తాగునీటి సమస్య పరిష్కరించాలని పలుమార్లు గ్రామ పంచాయతీ అధికారులకు విన్నవించినా పరిష్కారం కాలేదన్నారు. సంబంధిత అధికారులు తాగునీటి సమస్యను పరిష్కరించకపోతే పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామని మహిళలు హెచ్చరించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి మనోహర్‌ను వివరణ కోరగా ఉప్పరపల్లె గ్రామంలో నీటి సమస్య ఉన్నది వాస్తవమేనని పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆయన వివరించారు.

నీటి సమస్యను పరిష్కరించండి

రామాపురం : గ్రామాల్లో మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్టు రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండల పరిధి బైరెడ్డిగారిపల్లెలో రూ.16.80లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్డును గురువారం మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథరెడ్డితో కలసి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి వీధికి సిమెంటు రోడ్డు, వీధి లైట్లు, డ్రైనేజీ కాలువలు ఏర్పాటు చేస్తామన్నారు. గ్రామస్తులు మంచినీటి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన సమస్య పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలానే మండల పరిధి సుద్దమళ్ల గ్రామం చింతలవాండ్లపల్లెలో శ్రీ సీతారామలక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిలు పాల్గొని పూజా కార్యక్రమాలు చేయించారు.

క్లుప్తంగా..

ప్రవేశ పరీక్ష తేదీ మార్పు

సంబేపల్లె/రాయచోటి టౌన్/రామాపురం : ఏప్రిల్ 20వ తేదీ జరగాల్సిన మోడల్ స్కూల్ ఆరవ తరగతిలో ప్రవేశ పరీక్షను ఏప్రిల్ 21న నిర్వహించనున్నట్టు సంబేపల్లె, రాయచోటి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్స్ దిలీప్‌కుమార్, రేఖ, శ్యామలా దేవిలు ప్రకటనలో తెలిపారు. 20న ఈస్టర్ పండుగ ఉండటంతో పరీక్షను వాయిదా వేస్తున్నట్టు చెప్పారు.

18 నుంచి శ్రీ గంగాభవాని బ్రహ్మోత్సవాలు

సిద్దవటం : మండలంలోని మాధవరం–1 శివారులోని బంగారుపేటలో వెలసిన శ్రీ గంగా భవాని అమ్మవారి 33వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 18 నుంచి జరుపనున్నట్లు ఆలయ ఫ్యామిలీ ట్రస్టు అధ్యక్షుడు మాడా పెద్దసుబ్బరాయుడు, రామక్రిష్ణయ్యలు తెలిపారు.

అణగారిన వర్గాల ఆశాజ్యోతి పూలే

నందలూరు : మండల లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా నాగిరెడ్డిపల్లి పంచాయతీ కూడలిలోని పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువత సమాజ సేవలో భాగమవ్వాలి

లక్కిరెడ్డిపల్లి : యువత భారత స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరి సమాజ సేవలో భాగమవ్వాలని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాజ్ కుమార్ అన్నారు. గురువారం మోడల్ స్కూల్‌లో స్కౌట్స్, గైడ్స్ విభాగానికి ఎంపికై శిక్షణ పొందిన 24 మంది విద్యార్థులకు యూనిఫాం అందజేశారు.

కోడూరు వాసికి బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణానికి చెందిన వైఎస్ఆర్సీపీ నాయకుడు అబ్దుల్ రౌఫ్ కుమారుడు ఫర్దీన్ అహ్మద్‌కు గురువారం బెంగుళూరులో జరిగిన ఒక కార్యక్రమంలో కర్ణాటకా బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డు అందుకొన్నాడు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు సన్మానం

వీరబల్లి : మండల వైఎస్సార్‌సీపీ నాయకులైన ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ నాయకులు వీరనాగిరెడ్డిని గురువారం మండల చేనేత సంఘం వైఎస్సార్‌సీపీ అధ్యక్షులుగా నియామకమైన మదన్‌మోహన్ గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వారిని పూలదండలు, శాలువాలతో సన్మానం చేశారు.

సేవే లక్ష్యం

నందలూరు : మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీతోపాటు తోటపాలెంలో మన్నూరు రామలక్ష్మమ్మ, నారాయణ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మినరల్ వాటర్ పంపిణీ కేంద్రాన్ని ఎన్ఆర్ఐ కెకె రెడ్డి గురువారం ప్రారంభించారు.

అన్నదానం

వీరబల్లి : మండల ఆరోగ్య ప్రాథమిక కేంద్రంలో గురువారం గర్భిణులకు అన్నదానం చేశారు. ప్రతి నెల ఆరోగ్య కేంద్రంలో జరిగే గర్భిణులు, బాలింతల వైద్య పరీక్షల అనంతరం మండల ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని చేపడుతూ వస్తున్నారు.

నివాళి

రాజంపేట టౌన్ : పట్టణంలోని బలిజపల్లెరోడ్డులో నివాసం ఉంటున్న రెడ్డిచెర్ల శాంతమూర్తి ఇటీవల మృతి చెందారు. దీంతో గురువారం జరిగిన దశదిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆకేపాటి పాల్గొని శాంతమూర్తి చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు.

రాజంపేట రూరల్ : మండల పరిధిలోని పులపుత్తూరులో వీరంరెడ్డి జయరామిరెడ్డికి, పెద్దూరులో గుంటిమడుగు నరసింహరాజు మృతదేహాలకు ఎమ్మెల్యే ఆకేపాటి గురువారం నివాళులర్పించారు.

పూలేకు భారతరత్న ప్రకటించాలి

రాయచోటి టౌన్ : బీసీల అభ్యున్నతి కోసం విశేష కృషి చేసిన జ్యోతిరావు పూలే, సావిత్రి బాయ్ పూలేలని వైఎస్సార్ సీపీ బీసీ నేత శిబ్యాల విజయ భాస్కర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ పూలే సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నవజాత శిశువుకు ముర్రుపాలే అమృతం

రామాపురం : అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు అమృతంతో సమానమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హుస్సేనమ్మ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతల సమావేశంలో మాట్లాడుతూ గర్భవతిగా ఉన్నప్పుడు రక్తహీనత రాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు.

ఉప్పరపల్లె వాసికి డాక్టరేట్

సిద్దవటం : మండలంలోని ఉప్పరపల్లి గ్రామానికి చెందిన తిరువీధుల నరహరికి తిరుపతికి చెందిన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు వాణిజ్య శాస్త్రంలో పీహెచ్‌డీ ప్రదానం చేశారు.

అవసరమున్న చోట్ల సీసీ రోడ్ల నిర్మాణం



రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్ తదితరులు

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలోని పున్నాటివారిపల్లి గ్రామంలో రూ.15 లక్షలు వ్యయంతో నిర్మించిన సిమెంట్ రోడ్డును గురువారం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కడప అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ ముక్కా రూపానందరెడ్డిలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డును అవసరమున్న చోట పక్కా రోడ్లు వేయిస్తామని, గ్రామీణ అభివృద్ధే లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్ రెడ్డి, టిడిపి నాయకులు వెంకటేశ్వరరాజు, పున్నాటి వాసుదేవరెడ్డి, షేక్ మస్తాన్ వలీ, తల్లెం రమణారెడ్డి పాల్గొన్నారు.